క్లుప్తంగా

ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహం వితరణ



ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట గ్రామంలోని శ్రీ వీరాంజనేయ ఆలయంలో పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని స్థానిక కంకర మిషన్ యజమాని చంద్రశేఖర్‌రెడ్డి శనివారం వితరణ చేశారు. ఆలయానికి ఉత్సవ విగ్రహాన్ని అందించడం పట్ల స్థానికులు దాతను అభినందించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు లక్ష్మీదేవమ్మ, అనూష, అనిల కళ్యాణ్‌రెడ్డి, యక్షిత్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వాహకులు మదన్‌మోహన్ రెడ్డి, సుబ్బరాయుడు, కొండయ్య, రామసుబ్బారెడ్డి, మాజీ వీఆర్‌ఓ రామురెడ్డి, సహదేవ రెడ్డి, వెంకటరమణ, నరసింహులు, ఆచారి, ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పాలి కొండమ్మ జాతర

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ, గాండ్లపల్లె సమీపంలో కొలువైన పాలి కొండమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఛాందినీ బండ్ల ఊరేగింపు, తెల్లవారు జామున మొక్కులు తీర్చుకున్నారు.

25న గంగాభవానీ జాతర

గాలివీడు : శ్రీ దొనకొండ గంగాభవానీ అమ్మవారి జాతర ఈనెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, భక్తులు తెలిపారు.

మండలంలోని అరవీడు గ్రామం కసిరెడ్డి గారిపల్లె, రెడ్డివారిపల్లె సరిహద్దులోని పవిత్ర కుషావతి నది తీరాన వెలసిన శ్రీ దొనకొండ గంగాభవానీ అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా 25న శనివారం సాయంత్రం కూర్మయ్యగారిపల్లె నుంచి వీరతాళ్ల పెట్టెలతో పూజారులు, భక్తులు ఆలయం వద్దకు చేరుకుంటారు. నైవేద్యంతో నిండు తిరుణాలగా మారుతోంది. రాత్రికి చెంచునాటకం, చక్కభజనలు, విద్యుత్ కాంతులతో అలంకరించిన చాందినీబండ్లు, బాణాసంచాతో అంగరంగవైభవంగా జాతర జరుగుతుంది. 26న ఆదివారం ఉదయం అమ్మవారి రథోత్సవం, బోనాల రూపంలో మహిళలు, భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.

కాయ్ రాజా కాయ్

రామాపురం : సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఓటర్ల తీర్పు బ్యాలెట్ బాక్సులలో నిక్షిప్తమై ఉంది. వచ్చే నెల నాలుగో తేదీన అభ్యర్థుల భవితవ్యం వెల్లడికానుంది. విజయం ఎవరి వరిస్తోందనే చర్చ జోరుగా సాగుతోంది.

అయితే గ్రామల్లో అభ్యర్థుల గెలుపోటములపై జోరుగా బెట్టింగ్‌లు కాస్తున్నారు. మండలంలోని 32 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు జరిగాయి. మండలంలోని గ్రామాల్లో పార్టీల నాయకులు తమ పార్టీకే మెజార్టీ వస్తుందని ధీమాతో బెట్టింగ్‌లు కడుతున్నారు. కొన్ని చోట్ల గ్రామాల వారీగా బెట్టింగులు జరిగితే మరి కొన్న చోట్ల పోలింగ్ కేంద్రాల వారీగా మెజార్టీ వస్తోందని బెట్టింగ్‌లు కడుతున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో నియోజకవర్గాల వారీగా మెజార్టీపై పందేలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారనే దానిపై అక్కడక్కడా బెట్టింగ్‌లు పెడుతున్నారు.

నివాళి



దామతుల్లా బాషాకు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలోని కర్లపువాండ్లపల్లెకు చెందిన దామతుల్లా బాషా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానిక నేతల ద్వారా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి శనివారం మృతుడి స్వగ్రామానికి చేరుకొని దామతుల్లా మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వెంకట్రామిరెడ్డి, చలమారెడ్డి నివాళులు అర్పించారు.

ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలి

రాయచోటి టౌన్ : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రాగానే 10,117 కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం ధర్మ పోరాట ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారామెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, యస్‌ఎంఆర్‌లను అందరినీ రెగ్యులర్ చేసేవరకు ఉద్యమిస్తామని ప్రకటించారు. అలాగే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని శనివారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.

బ్రహ్మోత్సవాలకు రారండి

- 24న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం
- ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్



భువనగిరిపల్లిలోని ఆలయ ముఖద్వారం



శ్రీ భువనగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

రాజంపేట రూరల్ : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భువనగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 21వ తేదీ మంగళవారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదురోజుల పాటు వైభవంగా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలలో 24వ తేదీన నిర్వహించే కల్యాణం విశిష్టమైనది. జిల్లాలో ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు అందజేసే ఏకైక నరసింహస్వామి ఆలయంగా కీర్తించబడుతుంది. ప్రతి సంవత్సరం స్వామివారికి భువనగిరిపల్లెలోని శ్రీకోదండరామస్వామి ఆలయం నుంచి కొండమీదికి మేళతాళాలతో, భాజా భజంత్రీలతో ముత్యాల తలంబ్రాలను తీసుకురావడం ఆనవాయితీగా వస్తోంది.

నరసింహస్వామి ఆలయ చరిత్ర

315 సంవత్సరాల క్రితంలో భువనగిరిపల్లి వద్ద ఉన్న కొండపై ఒక వేపచెట్టు కింద శ్రీ అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీ మహావిష్ణువు పాదాలు ఉండేవి. వాటిని గమనించిన ఒక సాధువు ప్రతిరోజు పూజలు నిర్వహించేవాడు. భువనగిరిపల్లి ప్రజలు గోవులను మేపుకునేందుకు కొండపైకి వెళ్లగా అక్కడ పూజలు చేసే సాధువు వారిని పిలిచి ఇక్కడ సాక్షాత్తూ శ్రీ లక్ష్మినరసింహస్వామివారి పాద ముద్రలు ఉన్నాయి అని తెలిపేవాడు. ఇక్కడ పూజలు నిర్వహించే వారికి ఆయన కోరుకున్న కోర్కెలు తీరుస్తారని చెప్పాడు. కొన్నేళ్లకు అదే స్థలంలో శ్రీ లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్‌ను ప్రతిష్ఠింపచేసి ఆలయాన్ని నిర్మింపచేశారు.

నరసింహస్వామిని దర్శించుకున్న అన్నమయ్య

పదకవిత పితామహుడైన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీ లక్ష్మినరసింహస్వామిని పలుమార్లు దర్శించుకున్నారని పెద్దలు ఇప్పటికీ గుర్తుచేస్తూ ఉంటారు. అన్నమయ్య తన స్వగ్రామమైన తాళ్లపాక నుంచి అమ్మమ్మగారి ఊరు అయిన (ఉడుమూరు)ఊటుకూరికి వెళ్లినపుడు శ్రీ భువనగిరిపల్లి కొండపైకి వెళ్లి స్వామివారి పాదాలను దర్శించుకునేవారట. అదే విధంగా అక్కడవున్న లక్ష్మినరసింహస్వామిని కీర్తిస్తూ కొన్ని కీర్తనలుకూడా రాశారని స్థానికులు గుర్తుచేస్తున్నారు.

బ్రహ్మోత్సవ వివరాలు

- ఈ నెల 21న మంగళవారం గణపతిపూజతో శ్రీ భువనగిరి లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి ధ్వజారోహణంపై స్వామివారు ప్రజలకు దర్శనమిస్తారు.
- నరసింహస్వామి జయంతి సందర్భంగా 22వ తేదీన బుధవారం ఉదయం అభిషేకాలతో పాటు జయంతి వేడుకలు నిర్వహిస్తారు. రాత్రి స్వామివారికి హనుమ ద్వాహనము నిర్వహిస్తారు.
- 23వ తేదీన గురువారం ఉదయం అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి స్వామివారికి గరుడసేవ నిర్వహిస్తారు.
- 24న శుక్రవారం ఉదయం 09.26 గంటల నుంచి 11.37గంటల వరకు అంగరంగ వైభవంగా శ్రీ నరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తారు. భక్తులకు కల్యాణం సందర్భంగా ఉచిత బోజనం ఏర్పాటు చేస్తారు. రాత్రి స్వామివారు గజవాహనంపై ప్రజలకు దర్శనమిస్తారు.
- 25వ తేదీన శనివారం ఉదయం వసంతసేవ ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి ఏకాంత సేవ, ధ్వజా అవరోహణము నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగింపు చేస్తారు. ప్రతిరోజూ రాత్రివేళ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహిస్తారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్‌ను బాధితులకు అందజేస్తున్న మేడా మధుసూదన్‌రెడ్డి

సిద్దవటం (ఒంటిమిట్ట) : సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిదని వైఎస్సార్ సీపీ నాయకులు మేడా మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి పంచాయతీకి చెందిన పోలిచర్ల వసంతకు రూ. 2.50 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాగా మేడా మధుసూదన్‌రెడ్డి శనివారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన పోలిచర్ల సుబ్బరాయుడు అనారోగ్యంతో మృతి చెందగా.. మనస్థాపంతో సుబ్బరాయుడు భార్య వెంకట సుబ్బమ్మ కూడా అనారోగ్యంతో మృతి చెందింది. అనారోగ్యంతో మృతి చెందిన పులిచర్ల సుబ్బరాయుడుకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 2.50 లక్షలు మంజూరైంది. ఈ మేరకు పులిచెర్ల సుబ్బరాయుడు కుమార్తె వసంత కుటుంబ సభ్యులకు మధుసూదన్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు.

మండల కార్యాలయాన్ని తనిఖీ చేసిన సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

పుల్లంపేట : పుల్లంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని ఉమ్మడి కడప జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం సుధాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను ఏ విధంగా ఖర్చు చేశారో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేఓ హబీబుల్లా, ఈఓపీఆర్‌డీ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ టీకాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సనా అయేషా

వాల్మీకిపురం: క్షయ వ్యాధి లేని సమాజ లక్ష్యసాధన కోసం వయోజన బీసీజీ టీకాను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి సనా అయేషా అన్నారు. శనివారం మండలంలోని మూరేవాండ్లపల్లిలో 104 సేవలకు హాజరైన ప్రజలకు ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీజీ టీకాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, వైద్య సిబ్బంది రెడ్డెమ్మ, వనిత పాల్గొన్నారు.

ఆదాయం పెంచి సంస్థ అభివృద్ధికి సహకరించాలి



కండక్టర్ అబ్రహాంకు నగదు బహుమతి అందజేస్తున్న డీఎం

మదనపల్లె సిటీ: ఆదాయం పెంచి ఆర్టీసీ సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆర్టీసీ–1 డీఎం మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. శనివారం స్థానిక డిపో కార్యాలయంలో మదనపల్లె–బీ.కొత్తకోట రూటులోని డ్రైవర్లు, కండక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బి.కొత్తకోట రూటులో ఆదాయం పెంచాలన్నారు. ఏప్రిల్ నెలలో అత్యధికంగా ఈపీకె తెచ్చిన కండక్టర్ బి.అబ్రహాంకు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి నల్లవీర గంగమ్మ జాతర



జాతరకు ముస్తాబైన ఆలయం

వాల్మీకిపురం: వాల్మీకిపురం గ్రామ దేవత శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి జాతరను ఈ నెల 19 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త రమణా రెడ్డి తెలిపారు. ఆదివారం, గురువారం గంగరాళ్లకు నీళ్లపోయుట, శుక్రవారం శేషపోయుట, అఖండ జ్యోతి వెలిగించుట, కలశస్థాపన, ధ్వజారోహణ, ఉలవదేవర అమ్మవారి జాగారం, శనివారం పాలపొంగు దేవర జాగారం, 26న గంగరాళ్లకు నీళ్ల పోయుట, దీలుబోణాలు సమర్పణ, 27న సోమవారం దోపు తిరునాల నిర్వహిస్తారని తెలిపారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు

సిద్దవటం (ఒంటిమిట్ట) : మద్యం సేవించి గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న హెచ్చరించారు. సిద్దవటంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని, ఎన్నికలు అనంతరం కూడా రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో కేసు నమోదైతే కోర్టుల చుట్టూ తిరగాల్సి ఉంటుందన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం

సిద్దవటం (ఒంటిమిట్ట) : మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎలక్షన్ కోడ్ కారణంతో మండల సర్వసభ్య సమావేశం పోలీసుల సమక్షంలో నామమాత్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఉమా మహేశ్వర్‌రావు, సీఐ పురుషోత్తం రాజు, ఎస్‌ఐ పెద్దఓబన్న సమక్షంలో ఎలక్షన్ కోడ్ కారణంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోర్ సభ్యులతో రిజిస్టర్‌లో సంతకాలు చేయించుకుని సమావేశాన్ని నిర్వహించారు.

రాయచోటిలో మోస్తరు వర్షాలు

రాయచోటి : నైరుతి రుతుపవనాల కారణంగా రాయచోటిలో మోస్తరుగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు వర్షపు జల్లులు కురిసాయి. రెండు రోజులుగా వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ఆకాశమంతా మేఘావృతమైంది. ప్రస్తుతం ఉపరితల ద్రోణి ఆవరణంతో ఈ వర్షాలు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్నట్లు వాతావరణశాఖ తెలిపింది. ఈ వర్షాలు మరింత బలపడి జిల్లాలో సాధారణం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు, వేకువజామునే పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వికసించిన మే పుష్పం



వికసించిన మే పుష్పం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం రామారావుకాలనీలోని ప్రముఖ నవలా రచయిత టీఎస్ఏ క్రిష్ణమూర్తి ఇంటి ఆవరణంలో మే పుష్పం వికసించింది. మే పుష్పం చూపరులకు కనువిందు చేస్తోంది. ఏడాదికి ఓ సారి కనిపించే పువ్వులను స్థానికులు తిలకిస్తున్నారు.

కన్నుల పండువగా కన్యకాపరమేశ్వరీ జయంతి



క్షీరకలిశాలతో మహిళలు గ్రామోత్సవం

నందలూరు (రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో కన్యకా పరమేశ్వరీ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆలయ అర్చకులు మృత్యుంజయ స్వామి ఆధ్వర్యంలో ఉదయం క్షీరకలిశాలతో మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం ఎదురుగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి శాల నుంచి స్థానిక బస్టాండ్ కూడలి వరకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవంలో ఆర్యవైశ్య మహిళలు, సంఘ సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి, వైస్ ప్రెసిడెంట్ మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహశెట్టి, సెక్రటరీ గెలివి కుమార్, మాజీ అధ్యక్షకార్యదర్శులు గెలివి మల్లికార్జున శెట్టి, మేడా వెంకటకుమార్, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు గెలివి జయలక్ష్మీ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఎంబలూరు అనీల్ కుమార్, గెలివి లోకేష్, వి చంద్రశేఖర్, వల్లంకొండు శివ, ఎంబలూరు నరసింహప్రసాద్, గోపిశెట్టి రఘు, గెలివి నరేష్, తులసీ, గిరి, దరిశ హేమంత్, భూపాలం సునీల్ పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరీ జయంతోత్సవం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో శనివారం కన్యకాపరమేశ్వరీ దేవి జయంతోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు దీపాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి రమేష్, చలపాటి హరినాథ్, సత్యనారాయణ, బాలాజీ, అనురాధ, పార్థసారథి పాల్గొన్నారు.

వైభవంగా వాసవీ జయంతి వేడుకలు



క్షీరకలిశాలతో మహిళలు గ్రామోత్సవం

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేటలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం శ్రీవాసవీ జయంతి ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం ఉత్సవమూర్తులు, శ్రీ చక్రమా, స్పటికలింగాలకు రుద్రాభిషేకం, కంచామృతాభిషేకాలు, మహాగణపతి పూజ, మహా మంగళ హారతి చేశారు. రాత్రికి అమ్మవారికి కుంకుమార్చన పూజలు, భజనలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్యవైశ్య సభ్యులు చిన్నరెడ్డయ్య, సురేంద్ర, వీరయ్య, గణేష్, నరసింహులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకారంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి

లక్కిరెడ్డిపల్లి : రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలోని మర్రిచెట్టు వద్ద వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అర్చకులు వెంకటనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. రామాపురం రోడ్డు మార్గంలోని గద్దగుండ్ల రాచపల్లి సమీపంలోని నామాలగుట్టపై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు స్వామి దర్శనాన్ని కల్పించారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ నిర్వహకులు పాల్గొన్నారు.

శ్రీ కాలభైరవుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ కాలభైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలో ఉన్న పెద్ద గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శనివారం అనంతరం స్వామి వారికి పట్టు వస్త్రాలు, రంగు రంగుల పూలతో అలంకరించి భక్తుల దర్శన ఏర్పాటు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

22న హోమాలు

శ్రీ కాలభైరవుడి తిరుణాల సందర్భంగా ఈ నెల 22న హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ హోమంలో పాల్గొనే వారు తమ నామ గోత్రాలు పంపాలని కోరారు. అలాగే ఆ రోజు స్వామి వారిని దర్శనం చేసుకొని కరుణకటాక్షాలను పొందాలని కోరారు.

అత్యంత వైభవంగా మారమ్మతల్లి జాతర



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న మారమ్మతల్లి



అమ్మవారికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

- అమ్మవారికి పూజలు చేసిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : మారమ్మ తల్లి జాతరను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సోదరులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్ రెడ్డి, ఆకేపాటి మురళీరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మండల పరిధిలోని ఆకేపాడులోని లచ్చయ్యగారిపల్లెలో 200 సంవత్సరాల అనంతరం మారమ్మతల్లి జాతరను నిర్వహించేందుకు శనివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. మారమ్మతల్లిని పసుపు, కుంకుమ, గాజులు, చీరతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ప్రత్యేక శోభ వెల్లివిరిస్తోంది. జెడ్పీ చైర్మన్ ఆకే పాటి అమరనాథరెడ్డి మారమ్మతల్లికి ప్రత్యేక పూజలను చేసి జాతరకు అంకురార్పణ చేశారు. ముందుగా పోతురాజు (దున్నపోతు)కు ప్రత్యేక పూజలు చేశారు. ఆసాదుల దీవెనల అనంతరం పోతలరాజు వెంట వస్తుండగా పోతురాజుకు గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలలో ఆకేపాడు 14 గ్రామాలలోని మహిళలు, ప్రజలు, భక్తులు, బంధవులు గ్రామాల్లో సందడి నెలకొంది. ఈ వేడుకలలో ఆకేపాటి సోదరుడు, వైఎస్ ఎంపీపీ ఆకేపాటి రంగారెడ్డి, పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని పూజలు చేశారు.

నల్లగంగమ్మ తిరునాలకు ఆహ్వానం



పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భక్తులు

గాలివీడు : సంబేపల్లె మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ తిరునాలను ఈనెల 23న నిర్వహించనున్నారు. శనివారం తిరుణాలకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాల ద్వారా నిర్వాహకులు ఆహ్వానించారు. తిరుణాల మహోత్సవానికి భక్తులందరూ పాల్గొని అమ్మవారికి ఆశీస్సులు పొందాలని కోరారు.

సింహవాహనంపై వెంకన్న వైభవం



సింహవాహనంపై స్వామివారు

మదనపల్లె సిటీ: ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం సింహవాహనంపై కొలువై విహరిస్తూ భక్తులకు అనుగ్రహించారు. దిగువకమ్మపల్లె ఉభయదారులుగా స్వామివారి సింహవాహన సేవ ప్రారంభమైంది. అలాగే నెహ్రూబజార్, త్యాగరాజవీధి, గుండ్లూరివీధి, రాఘవేంద్రరావువీధి, దేవళంవీధికి చెందిన ఉభయదారులు స్వామివారి హనుమంత వాహనం ప్రారంభించారు. వాహనం ముందు భక్తజన బృందాల చెక్కభజనలు, కోటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహన సేవ కోలాహలంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు పలికి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు తదితరులు పాల్గొన్నారు.